

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరుసిటీ



జిల్లా కేంద్రమైన ఏలూరులో టెట్ పరీక్షలు శనివారం ఐదో రోజు కొనసాగాయి. సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ కాలేజ్, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన పరీక్షల్లో ఉదయం పరీక్షకు 365 మంది హాజరు కావాల్సి ఉండగా 328 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 365 మందికిగాను 328 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిఇఒ అబ్రహం తెలిపారు.

రసవత్తరం.. రణరంగం

జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది. జిల్లాలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీల నేతలు పాకులాడుతున్నారు. టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల జాబితా ప్రకటనతో రాజకీయం ఊపందుకున్నాయి. అయితే టిక్కెట్లు ఆశించి దక్కని వారు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా రాజకీయం రణరంగంగా మారింది. ఈ నేపథ్యంలో సీనియర్ నేతల పలకరింపులు, బుజ్జగింపులతో జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది.



పట్టు కోసం రాజకీయ పార్టీల నేతల పాకులాట

ప్రతిపక్ష కూటమికి తప్పని అసంతృప్తి సెగలు

ఎన్నికల్లో పోటీ చేస్తామనే ప్రకటనలతో ప్రకంపనాలు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ఒక ప్రత్యేకత ఉంది. ఎన్నికల్లో ఈ జిల్లాలో ఏ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకొస్తుందనేది నానుడి. దీంతో రాజకీయ పార్టీలు కూడా గోదావరి జిల్లాలపైనే ఎక్కువ కేంద్రీకరిస్తూ ఉంటాయి. 2014 ఎన్నికల్లో టిడిపి ఈ జిల్లాలో క్లీన్ స్వీప్ చేసి రాష్ట్రంలో అధికారం చేపట్టింది. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి సైతం ఎక్కువ స్థానాలు గెలుపొంది జిల్లాను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాపై పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలు తహతహలాడుతున్నాయి. టిడిపి, జనసేన, వైసిపి తమ ప్రాబల్యాన్ని ఎన్నికల్లో చూపించేందుకు సిద్ధమయ్యాయి. ప్రతి అడుగు ఆచితూచి వేయడంతోపాటు ప్రత్యర్థులను మట్టి కరిపించేందుకు ఎవరికి వారే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే వైసిపి జిల్లాలో ఉన్న సిట్టింగ్ ఎంఎల్ఎలకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు అవకాశం కల్పించడంతో వారు ప్రజాక్షేత్రంలో వివిధ కార్యక్రమాలు చేస్తూ ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. టిడిపి, జనసేన కూటమి తరపున ఏడుగురు అభ్యర్థులను ప్రకటించారు. ఈ నియోజకవర్గాల్లో ఆది నుంచి టిడిపికి పట్టు ఉండడంతో ఈసారి మళ్లీ ఆ పార్టీ అభ్యర్థులే ఇక్కడ బరిలోకి దిగుతున్నారు. అయితే జనసేన నుంచి ఒక్క స్థానాన్ని కూడా ప్రకటించకపోవడంతో కేడర్ అయోమయానికి గురైంది. 2014 ఎన్నికల్లో రెండు ఎంపీ స్థానాలు, 14 ఎంఎల్ఎ స్థానాలను టిడిపి గెలుచుకుంది. అప్పట్లో జిల్లాలో వైసిపి అంత ప్రాబల్యం చూపించలేకపోవడంతో కనీసం బోణీ కూడా చేయలేదు. 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా వైసిపి పవనాలు వీయడంతో జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, 12 ఎంఎల్ఎ స్థానాలను గెలుచుకుంది. పాలకొల్లు, ఉండి స్థానాలను టిడిపి సాధించింది. కొన్ని నియోజకవర్గాల్లో జనసేన ఆ పార్టీలకు ధీటుగా గట్టి పోటీ ఇచ్చిందేగాని ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఈసారి జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీకి దిగుతున్న సందర్భంలో పూర్వవైభవాన్ని సాధించాలని గట్టి సంకల్పంతో ఉన్నాయి. సంక్షేమ పథకాలే ప్రధాన అస్త్రంగా ముందుకు సాగుతున్న అధికార పార్టీ వైసిపి కూడా గతం మాదిరిగానే జిల్లాలో తమ బలాన్ని, ప్రాబల్యాన్ని చూపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది.

అసంతృప్తులు.. నిరసన సెగలు

టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితా ప్రకటనతో జిల్లాలో ఆశావహుల అసంతృప్తులు వెల్లువెత్తాయి. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరు వెంకటశివరామరాజు మధ్య ఉండి స్థానంపై మొదట నుంచి రగడ జరుగుతుంది. అయితే సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజును ఉండి అభ్యర్థిగా టిడిపి అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎంఎల్ఎ శివరామరాజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శివరామరాజును బుజ్జగించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు, అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఫోన్ ద్వారా సంప్రదించినప్పటికీ శివ వాళ్లతో మాట్లాడేందుకు నిరాకరించినట్లు తెలిసింది. ఎంఎల్ఎ మంతెన రామరాజు తన సతీమణిని తీసుకుని శివరామరాజు స్వగ్రామమైన కలగపూడిలో ఇంటికి వెళ్లినప్పటికీ శివరామరాజు వాళ్లకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారని ప్రచారం సాగుతోంది. కనీసం తనను సంప్రదించకుండా టిడిపి అవమానించిందని, ఎంఎల్ఎ రామరాజుకు ఎన్నికల్లో సహకరించే ప్రసక్తి లేదని శివరామరాజు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. తాను ఎన్నికల్లో పోటీ చేసి తీరుతానని, తన నిర్ణయాన్ని త్వరలో వెల్లడిస్తానని శివ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

2019 నుంచి తణుకు టిక్కెట్‌ను జనసేన నేత విడివాడ రామచంద్రరావు ఆశించి పార్టీ కార్యక్రమాలన్నీ తానే నిర్వహించారు. అయితే చివరి నిమిషంలో జనసేన టిక్కెట్‌ను విడివాడకు ఇవ్వకుండా తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన పసుపులేటి వెంకటరామారావుకు కేటాయించారు. అక్కడ ఆయన ఓటమి అనంతరం జనసేనను వీడి వేరే పార్టీలో చేరారు. అప్పటి నుంచి నేటి వరకు విడివాడ మాత్రం జనసేనలోనే కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలను భుజస్కంధాలపై వేసుకున్నారు. వారాహి యాత్రలో భాగంగా తణుకులో జరిగిన సభలో విడివాడ రామచంద్రరావుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పి రానున్న ఎన్నికల్లో విడివాడ ఇక్కడి నుంచే పోటీ చేస్తారని ప్రకటించారు. అయితే ఇక్కడ టిడిపి అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేరును ప్రకటించడంపై విడివాడ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భీమవరంలో కూడా అసంతృప్తి సెగలు చాపకింద నీరులా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏడు స్థానాలను టిడిపికి కేటాయించడంతో మరో ఏడు లేదా ఐదు స్థానాలు జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. రెండో జాబితా ప్రకటించాక జిల్లాలో రాజకీయ పరిస్థితులు ఏవిధంగా ఉంటాయో అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది.

మాస్ వార్నింగ్‌ల కలకలం

వైసిపి అధినేత, సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు అభ్యర్థులకు ఇచ్చిన మాస్ వార్నింగ్‌లు వారిని కలవరపెడుతున్నాయి. టిక్కెట్ వచ్చిందని అభ్యర్థులు ఆనంద పడటం కాదని, ఇగోలన్నీ పక్కనపెట్టి మాజీలను కలుపుకుని ప్రజలతో మమేకమవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. పనితీరు తేడా వస్తే అభ్యర్థులను మారుస్తామని ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. వైసిపి ఎంఎల్ఎలు, ఇన్‌ఛార్జులంతా రానున్న ఎన్నికల్లో అభ్యర్థులు కారని, పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ఎన్నికల ముందు ప్రకటిస్తారని టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసిపిలో గుబులు పుట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.



నినదిస్తున్న సర్పంచులు

గ్రామ స్వరాజ్యాన్ని హరించిన వైసిపిని ఓడించాలి

ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

కలెక్టరేట్ వద్ద సర్పంచుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం దోచుకున్న 14, 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతించాలని కోరినా పోలీసులు నిరాకరించడంతో బారికేడ్లను తోసుకుని కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకున్నారు. అప్పటికే పోలీసులు అప్రమత్తమై కలెక్టరేట్ గేటును మూసివేయడంతో అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, సర్పంచులకు మధ్య పెద్దఎత్తున తోపులాట జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్థానిక సంస్థల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసిపిని ఓడించాలన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచుల నిధులు, అధికారాలు, విధులను దొంగిలించిందని, వాటిని తిరివ్వాలని మూడు సంవత్సరాల నుంచి ఆందోళనలు, పోరాటాలు చేసినా ముఖ్యమంత్రిగాని, ప్రభుత్వంగాని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. 'జగన్ ఓడితేనే మన మనుగడ' నినాదంతో అన్ని పార్టీల సర్పంచులూ, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఈ రెండు నెలల్లో చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి సర్పంచుల సంఘం గౌరవ సలహాదారు పిల్లి సత్తిరాజు, పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కడలి గోపాలరావు, పాలడుగు లక్ష్మణరావు, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులదే కీలక బాధ్యత

ఎన్నికల శిక్షణలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి


ప్రజాశక్తి - ఏలూరు


మాట్లాడుతున్న జెసి లావణ్యవేణి

రానున్న ఎన్నికల నేపథ్యంలో నియమితులైన సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ వ్యక్తిగతంగా సందర్శించి వసతులను, ప్రతికూలత, అనుకూలతలను పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్ల శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే ముఖ్యబాధ్యత అని అన్నారు. తమ పరిధిలో సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లాఅండ్ఆర్డర్ పరిస్థితులు ఎలాగున్నాయో పరిశీలించాలన్నారు. ప్రతి ఎన్నికలను కొత్తగానే చూడాలని, ఏ దశలోనూ ఎటువంటి తప్పిదాలకూ ఆస్కారం ఇవ్వరాదని ఆమె స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారులు ఈ సెక్టార్ అధికారులకు అనుసంధానమై ఉంటారన్నారు. సెక్టార్ అధికారులు పోలింగ్ స్టేషన్లను సందర్శించి కనీస అవసరాలను పరిశీలించాలన్నారు. దీంతోపాటు ఆ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటింగ్ శాతం గతంలో ఉన్న అనుభవాలు, తదితర పరిస్థితులను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఇవిఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు చేర్చే వరకు సెక్టార్ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ ముందురోజు కూడా సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. పోలింగ్ రోజున విధులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి మాట్లాడుతూ ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ సెక్టార్ ఆఫీసర్లకు నిర్దేశించిన మార్గదర్శకాలతో కూడిన పుస్తకాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు ఇచ్చే సమాచారం ఎంతో ప్రధానమని, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు. పోలవరం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ సెక్టార్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలోని ప్రతి అంశాన్నీ శ్రద్ధగా అర్థం చేసుకుని ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా చూడాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లకు నిర్దేశించిన ఎన్నికల విధులు నిర్వహించే సమయంలో ఏది చేయాలి, ఏది చేయకూడదనే విషయాలను ఆయన వివరించారు. వల్నరబిలిటీ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం మాస్టర్ ట్రెయినీ చక్రపాణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సెక్టార్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులపై స్పష్టంగా అవగాహన కల్పించారు. సెక్టార్ అధికారులకు ఎన్నికల కమిషన్ కల్పించిన అధికారంతో నిష్పక్షపాతంగా వారి విధులను నిర్వర్తించాలన్నారు. పోలింగ్ రోజున ఎన్నికల సామగ్రి, పోలీస్ సిబ్బంది బస్సుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలింపు, పోలింగ్ రోజున సిబ్బంది సిద్ధంగా ఉన్నదీ లేనిదీ, మాక్ పోలింగ్ నిర్వహించారా, లేదా, మాక్ పోల్‌ను డిలీట్ చేసి ఓటింగ్‌కు సిద్ధంగా ఉన్నారా, లేదా పరిశీలించాలన్నారు. ఓటింగ్ జరుగుతున్నప్పుడు ఓటింగ్ శాతం పరిశీలన, పోలింగ్ పూర్తయ్యి అనంతరం పోలింగ్ సామగ్రి రిసెప్షన్ కేంద్రానికి చేరిందీ, లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. అనంతరం ఇవిఎంలు, వివిప్యాట్‌ల నిర్వహణా తీరును ప్రత్యక్షంగా ప్రదర్శించి సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులైన ఆర్‌డిఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలి, వై.భవానిశంకరి, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పాక్సోపై అవగాహన తప్పనిసరి

మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్



మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

పోక్సో చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులతో పోక్సో చట్టం, బాధితులకు పరిహారం, ఎన్‌డిపిఎస్ చట్టాలపై అవగాహనా సదస్సును జిల్లా ఎస్‌పి కార్యాలయంలోని సమావేశపు హాలులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి మొదటి జిల్లా అదనపు జడ్జి జి.రామగోపాల్ మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేదని తెలిపారు. 2012 నవంబరు 14 నుండి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులను వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చన్నారు. మాదకద్రవ్యాల కేసుల్లో నేర పరిశీలన, కోర్టుల్లో కేసుల దాఖలు తదితర అంశాలపై పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు. మారుతున్న చట్టాలపైనా అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్గి ఉండాలన్నారు. అప్పుడే బాధితులకు త్వరగా న్యాయం అదేలా చేయవచ్చని తెలిపారు. 8వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ కోర్టుల్లో సమన్లను, వారెంట్లను ఎన్ స్టెప్ అనే ఆన్‌లైన్ విధానం ద్వారా అమలు చేస్తున్నారని, రాష్ట్రంలో మొదటిసారి ఏలూరులోని ఎస్‌సి, ఎస్‌టి కోర్టు, మొబైల్ కోర్టుల్లో దీనిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లలో 25 మంది కానిస్టేబుల్స్‌ను నియమించామని, వీరు ప్రతిరోజూ ఆన్‌లైన్ విధానంలో నోటీసులను, వారెంట్లను పంపుతారన్నారు. తద్వారా తక్కువ సమయంలో బాధితులకు న్యాయం అందేలా ఈ పైలెట్ ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఫోక్సో చట్టంలోని అంశాలను పోలీస్ అధికారులు, సిబ్బంది తెలుసుకుని బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. రోజురోజుకీ పోక్సో కేసులు పెరుగుతున్నాయన్నారు. శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ బాలిక కిడ్నాప్‌కు గురైనప్పుడు తల్లిదండ్రుల మనోవ్యథను గుర్తించి ఓదార్చి ధైర్యం చెప్పి కేసు నమోదు చేయాలన్నారు. తొలుత చట్టాల అవగాహన కార్యక్రమాన్ని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, 8వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్, శాశ్వత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎ.మేరీ గ్రేసీకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదస్సులో ఎఎస్‌పి జి.స్వరూపరాణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: ఎలిజా


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఎలిజా

చింతలపూడి: వచ్చే ఎన్నికల్లో తనను ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేయాలని చెప్పినా పోటీ చేసే ప్రసక్తి లేదని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలే వైసిపిని మరోసారి గెలిపిస్తాయని, జగన్ సిఎం కావడం ఖాయమని అన్నారు. లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడెంలో రూ.76 లక్షల విలువైన బిటి రోడ్డు మరమ్మతు పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎలిజా మాట్లాడుతూ తనను నమ్ముకున్న నేతలకు, కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు తాను అండగా ఉంటానన్నారు. తాను ఇక్కడే ఉంటానని, ప్రజలతో మమేకమవుతానని స్పష్టం చేశారు. వైసిపిని వీడేది లేదన్నారు. అందర్నీ కలుపుకుని వెళ్తేనే పార్టీ విజయం సాధిస్తుందని, వద్దనుకుంటే చేసేదేమీ లేదని వ్యంగ్యబాణాలు విసిరారు. కార్యక్రమంలో పండు, జగదీష్, జెడ్‌పిటిసి రాజు, వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 83 శాతం పూర్తి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 83 శాతం పంపిణీ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్ అండ్ అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్, పి అండ్ ఆర్‌డి, ఎన్ఆర్ఈజిఎ - కరువు మండలాల్లో పని దినాల కల్పన, తాగునీరు, పరిశ్రమల శాఖ - ఎంఎస్ఎంఇ క్లస్టర్‌లకు భూ కేటాయింపు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మిగిలినవి ప్రత్యేక డ్రైవ్ పెట్టి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాకు 5,05,458 ఆరోగ్యశ్రీ కార్డులు రావడం జరిగిందన్నారు. ఇకెవైసి ద్వారా 4,19,964 కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మిగిలినవి త్వరితగతిన పంపిణీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్ పెట్టి లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ 90 శాతం జరిగిందని, మరో 6,984 మాత్రమే పెండింగ్ ఉందని వివరిస్తూ ఇందుకు ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస విశ్వనాథ్, డిఎంహెచ్ఒ ఎస్.శర్మిష్ట, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.రాజీవ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.


పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ

బుట్టాయగూడెం: జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. అందులో భాగంగానే ప్రజలందరికీ శాశ్వత భూహక్కు పొందాలనే సంకల్పంతో పేదలందరికీ ఇళ్లు అనే కార్యక్రమంలో భాగంగా మండలంలో 18 గ్రామ సచివాలయాలలోని 303 మంది అర్హులకు సెంటున్నర ఇళ్ల పట్టాలను మంజూరు చేసి స్వయంగా ఎంఎల్ఎ బాలరాజు అందించడం జరిగిందన్నారు. శనివారం మండలంలోని తాట్కూరు గొమ్ము నిర్వాసిత గ్రామంలో అర్హులకు ఎంఎల్ఎ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, ఆర్ఐలు పద్మ, వెంకటలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, విఆర్ఒలు, విఆర్ఎలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న హీటు.. నేతలకు తప్పని ఫీట్లు..!

వేసవి ఎండలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. అదే సమయంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రాజకీయాలు సైతం అదే స్థాయిలో హీటెక్కడంతో ఆశావహులైన నేతలకు ఫీట్లు తప్పడం లేదు. టిక్కెట్లు ఖరారైన వారు ప్రచార వ్యూహాలపై కసరత్తు చేస్తుండగా, ఇంకా అభ్యర్థిత్వాలు ఖరారు కానివారు అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక టిక్కెట్ దక్కదని స్పష్టమైన ఆశావహులు ఆగ్రహంతో రగిలిపోతూ పక్కచూపులు చూస్తున్నారు. వెరసి ఎండల వేడి పెరగడంతో తల్లడిల్లుతున్న ప్రజలకు నేతల ఫీట్లు నవ్వు తెప్పిస్తుండటం విశేషం.

అధికార పార్టీ వైసిపి అభ్యర్థులు దాదాపు ఖరారైనట్లేనని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే ఏలూరు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గాలకు కొత్త సమన్వయ కర్తలను నియమించారు. చింతలపూడిలో సిట్టింగ్ ఎంఎల్ఎ ఎలిజాకు బదులు కె.విజయరాజును సమన్వయకర్తగా నియమించారు. మిగిలినచోట్ల దాదాపు సిట్టింగ్ ఎంఎల్ఎలకే టిక్కెట్లు ఖరారవుతాయనే ప్రచారం ఉంది. పాలకొల్లు, ఉండిలోనూ నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్నవారినే బరిలోకి దింపుతారా, లేక మార్చుతారా అనే సస్పెన్స్ అయితే కొనసాగుతోంది. ప్రధానంగా చింతలపూడిలో ఎలిజా మార్పు టీ కప్పులో తుపానులా సమసిపోయినట్లు కన్పిస్తోంది. అయితే విజయరాజుకు మద్దతుగా ఎలిజా ఎన్నికల్లో ప్రచారం చేస్తారా, లేదా అనేది వేచిచూడాల్సి ఉంది. ఇక ఉండి నుంచి పివిఎల్.నర్సింహరాజునే వైసిపి అభ్యర్థిగా బరిలోకి దిగుతారా, లేక టిడిపి నుంచి టిక్కెట్ దక్కని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజును పార్టీలో చేర్చుకుని బరిలోకి దింపుతారా అనే ఉత్కంఠ ఇంకా కొనసాగుతోంది. లేక శివ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగితే వైసిపి నుంచి శివ అభ్యర్థిత్వమే ఖరారయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రతిపక్ష టిడిపి, జనసేన కూటమి తరపున ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలకుగాను ఏడు స్థానాల్లో టిడిపి అభ్యర్థులను ప్రకటించారు. వీటిలో ఏలూరు, తణుకుల్లో జనసేన నుంచి టిడిపి అభ్యర్థులకు ప్రతికూలత తప్పని పరిస్థితి కన్పిస్తోంది. ఇక్కడ టిక్కెట్ ఆశించి భంగపడ్డ జనసేన నేతలు రెడ్డి అప్పలనాయుడు, విడివాడ రామచంద్రరావు మౌనంగా ఉంటారా, లేక స్వతంత్రులుగా బరిలోకి దిగుతారా అనేది తేలాల్సి ఉంది. మిగిలిన ఏడు స్థానాలపై మాత్రం ఎడతెగని ఉత్కంఠ సాగుతోంది. భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారని తొలుత భావించినా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభలోనూ దానిపై



ఎటువంటి ప్రకటనా చేయలేదు. ప్రస్తుత సమాచారం ప్రకారం కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పవన్ పోటీ చేస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భీమవరం నుంచి టిడిపి అభ్యర్థి బరిలో ఉంటారా లేక జనసేన అభ్యర్థి బరిలో ఉంటారా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. టిడిపి మాజీ ఎంఎల్ఎ అంజిబాబును టిడిపి నేతలతో కాకుండా ప్రత్యేకంగా ఆయన ఇంటికి వెళ్లి పవన్ కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పవన్ భీమవరం నుంచి పోటీ చేయకపోతే జనసేన అభ్యర్థిగా అంజిబాబు బరిలో ఉంటారని తెలుస్తోంది. నరసాపురం టిక్కెట్ జనసేనకు ఇస్తే బొమ్మిడి నాయకర్ పోటీ చేస్తారని అంతా భావించారు. అయితే ఆ పార్టీలోకి కొత్తగా మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు చేరడం, జెండా సభలో ప్రాధాన్యతివ్వడం పలు చర్చలకు తావిచ్చింది. ఇక్కడ నాయకర్ బరిలో ఉంటారా లేక కొత్తపల్లి రంగంలోకి దిగుతారా అనే చర్చ ప్రస్తుతం సాగుతోంది. తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, కైకలూరు, పోలవరం స్థానాలపైనా అటు జనసేన, ఇటు టిడిపి ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. బిజెపికి పొత్తులో జిల్లాలో టిక్కెట్ కేటాయిస్తే కైకలూరు కావొచ్చనే ప్రచారం ఉంది. దెందులూరు నుంచి బరిలోకి దిగేది టిడిపినే అయినా చింతమనేని ప్రభాకర్ అభ్యర్థిత్వం ప్రకటించకపోవడం చర్చకు తావిచ్చింది. ఈ క్రమంలో ఓపక్క అభ్యర్థిత్వాలు, మరోపక్క ఓట్ల బదిలీపై జనంలో విస్తృత చర్చమాత్రం సాగుతోంది.

టిక్కెట్ ఇచ్చే పార్టీనే రఘురామ పార్టీ..!

గత ఎన్నికల్లో వైసిపి నుంచి నరసాపురం ఎంపీగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజు కొద్దిరోజుల్లోనే ఆ పార్టీకి పంటి కింద రాయిలా మారి రెబల్‌గా మారారు. ఆయన ఇటీవల వైసిపికి రాజీనామా చేశారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభలో తానే ఏ పార్టీలో చేరలేదంటూనే తనదైన శైలిలో మాట్లాడారు. ఆపై రానున్న ఎన్నికల్లో తాను నరసాపురం ఎంపీ అభ్యర్థిగా ఈ కూటమి నుంచి బరిలోకి దిగుతానని, అయితే ఏ పార్టీ అనేది మరికొద్దిరోజుల్లో చెబుతాననడం, ఆ సమయంలో వేదికపై టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ గుసగుసలాడుకోవడం చర్చనీయాంశమైంది. గతంలోనూ రఘురామకృష్ణంరాజు టిడిపి, బిజెపి తరపున రెండు నామినేషన్లు దాఖలు చేసి వార్తల్లోకెక్కారు. బిజెపితో పొత్తు కుదిరితే నరసాపురం స్థానం బిజెపికి కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆ నేపథ్యంలో రఘురామ పొత్తులో ఈ సీటు ఏ పార్టీకి దక్కుతుందో ఆ పార్టీలో చేరి టిక్కెట్ దక్కించుకోవాలనే యోచనలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఏదేమైనా నామినేషన్ల ఘట్టం పూర్తయ్యే వరకూ ఎవరు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేని పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

నిండు ప్రాణానికి రెండు చుక్కలు..

నేడు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఐటిడిఎ పరిధిలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయటం జరిగిందని డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేతరిన్ తెలిపారు. ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సూర్య తేజ వైద్య సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేతరిన్ మాట్లాడుతూ మొత్తం 321 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని బూత్‌లు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని, సోమ, మంగళ వారాలు అన్ని గృహాలు సందర్శించి ఇంకా వ్యాక్సిన్ పొందని వారు ఉంటే వారికి కూడా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఐటిడిఎ అధికారులు పాల్గొన్నారు.


కుక్కునూరులో..


కొయ్యలగూడెంలో..

ఏలూరు టౌన్: పోలియో రహిత సమాజం కోసం ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, తద్వారా అంగవైకల్యాన్ని నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ఠా ప్రజలకు పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో ఏలూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ విజయలక్ష్మి, డెమో నాగరత్నం, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు పాల్గొన్నారు.

తంగెళ్లమూడి జంగారెడ్డిగూడెం రోడ్డులో హీరో షోరూం ఎదురుగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల శిబిరాన్ని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభిస్తారని మేయర్ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

ఉంగుటూరు: పల్స్ పోలియో చుక్కల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చేబ్రోలు పిహెచ్‌సి వైద్యాధికారి తెలిపారు. 2,355 మంది చిన్నారులకు టీకాలు వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు డ్యూటీలు వేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం సిబ్బందికి అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలియజేశారు.

భీమడోలు : గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నూరు శాతం పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టామని వైద్యురాలు డాక్టర్ కె.శ్రీలక్ష్మి తెలిపారు. ఆదివారం కార్యక్రమం చేపట్టనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని వైద్యురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సున్నా నుంచి ఐదు సంవత్సరాల మధ్య వయస్కులైన 3,626 మంది పిల్లలు ఉన్నట్టు గుర్తించామన్నారు. పోలియో చుక్కలు వేసేందుకు 34 బూత్‌లను ఏర్పాటు చేసామన్నారు. 136 మంది సిబ్బంది నియామకం చేశామన్నారు. వీరికి అదనంగా భీమడోలు రైల్వే స్టేషన్, భీమడోలు బస్టాండ్‌లో అదనపు బూత్‌ల ఏర్పాటు జరిగిందన్నారు. హై రిస్క్ ఏరియాలలో పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక సంచార బృందం ఒకదానిని ఏర్పాటు చేశామన్నారు. ఈనెల మూడో తేదీన అర్హులైన పిల్లలు గల ప్రతి కుటుంబీకులు తమకు సమీపంలోని పోలియో బూతులకు వెళ్లి పిల్లలకు చుక్కలు వేయించుకోవాలని కోరారు. ఆ తర్వాత క్రమంలో ఈనెల 4, 5వ తేదీల్లో కార్యక్రమానికి ప్రత్యేకించిన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు చుక్కలు వేసే కార్యక్రమాన్ని పూర్తి చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మురళీ, ఇతరులు పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరు మండల పరిధిలోని అమరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అనంత్, డాక్టర్ శ్రీకాంత్ పల్స్ పోలియో గురించి సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్లకు, ఎఎన్ఎంలకు, అంగన్వాడీ టీచర్లకు ఆదివారం జరగబోయే పల్స్ పోలియో గురించి సూచనలు, సలహాలు, అలాగే పోలియో డ్రాప్స్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించడం జరిగింది. ఈ సమావేశం అనంతరం పల్స్ పోలియో గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.


ఏలూరు టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న డిఎంహెచ్ఒ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలం పరింపుడిలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని పోలియో చుక్కలపై అవగాహన కల్పించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పంచాయతి అధికారులు తెలిపారు.

కామవరపుకోట: ఐదు సవంత్సరాల లోపు చిన్నారులు ఉన్న తల్లితండ్రులు తప్పనిసరిగా వారికి పోలియో చుక్కలు వేయించాలని వీరిశెట్టిగూడెం మత్స్యకార సొసైటీ ఛైర్మన్ పెనుమాల సంజీవ రావు తెలియజేశారు. ఆదివారం రాష్ట్రం వ్యాప్తంగా జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోలియో వ్యాధికి చికిత్స లేదు అని, కేవలం పోలియో చుక్కలు వేయించుకోవడం ద్వారానే దీనిని నివారించగలం అని తెలియజేశారు.

ముదినేపల్లి: పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి ఎండిడిఒ కె.రమణబాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం మండల పల్స్ పోలియో టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రమణబాబు మాట్లాడుతూ మార్చి 3వ తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో మండల పరిధిలో 5సం లోపు పిల్లలందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలని, నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు.

'స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తా'

ప్రజాశక్తి - ముసునూరు

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా.. మీ అండదండలు నాకు వుండలంటూ ముసునూరు గ్రామ ప్రజలను మాజీ ఎంపిటిసి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. శనివారం ముసునూరు మండలంలోని ముసునూరు గ్రామంలోని పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద భారీ బహిరంగ సభ(ఆత్మీయ సమావేశం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి నూజివీడు నియోజక వర్గంలోని నాలుగు మండలాల టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు అందరికీ నేనంటే ఏంటో తెలుసన్నారు. అందరి వాడిలా వుంటూ పార్టీ కార్యక్రమాలన్ని రాష్ట్ర స్థాయిలో సింగిల్ వరుసలో పనులు చేస్తుంటే టికెట్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ఎక్కడో పెనుమలూరు వైసిపి ఎంఎల్‌ఎను టిడిపి సభ్యత్వం కూడా లేకుండా, పార్టీలో కూడా చేరకుండా నూజివీడు టిక్కెట్ కేటాయించడం దుర్మార్గమన్నారు. నేను చేసిన తప్పేంటని ఆవేదన వ్యక్తం చేశారు. కావున నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ప్రజలందరూ ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


సమావేశంలో ముద్దరబోయిన

చేసిన పనులకు బిల్లులు చెల్లించాలి

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ఏలూరు సిటీ: గుత్తేదారులు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను, సర్పంచులకు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాలు జారీచేశారు. అలాగే గ్రామ పంచాయతీలో పేరుకుపోయిన కరెంట్ బకాయిలను కూడా చెల్లించాలని అన్నారు. జిల్లాలో 2022-2023 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు విడతలుగా 545 గ్రామ పంచాయతీలకు రూ.31 కోట్ల 65 లక్షలు జమ కాగా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా రూ.32 కోట్లు జమ అయ్యాయని అన్నారు. అయితే జమకాబడిన నిధులలో కేవలం రూ.32 కోట్లు మాత్రమే ఖర్చు చేసారని, ఇంకా 31 కోట్లు పైబడి ఖర్చు చేయాల్సి ఉందని డిపిఒ తెలిపారు. పంచాయతీ పరిధిలో పనులు చేసిన గుత్తేదారులకు బిల్లులు రావల్సిన ఫిర్యాదుల అందడంతో తక్షణమే కాంట్రాక్టర్ల నిబంధనల మేరకు బకాయిలు చెల్లించాలని ఆదేశాలు జారీచేశారు. త్వరలో 2023-2024 ఆర్థిక సంఘం నిధులు రెండవ విడత విడుదల కానున్నాయని డిపిఒ తెలియజేశారు.

ఓటుహక్కుపై అవగాహనా ర్యాలీ

నూజివీడు రూరల్: మండలంలోని పల్లెర్లమూడి, సుంకొల్లు, దిగవల్లి తదితర గ్రామాలలో రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఎసిఆర్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులు వారి ఓటు ఉందో లేదో జాబితాలో చూసుకోవాలని, లేకుంటే సచివాలయం వద్ద ఉన్న అధికారులను తెలుసుకోవాలని అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీప్ యాక్టివిటీస్ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో వర్క్ షాప్

నూజివీడు రూరల్: పట్టణంలోని ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో 'డిస్కవరీ డ్రోన్ ఇన్నోవేషన్స్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ సుమారు వెయ్యి మంది విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించడమే లక్ష్యమని అన్నారు. యువత భవిష్యత్తు టెక్నాలజీపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పాలి

ఏలూరు: వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ కార్యోన్ముఖులు కావాలని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఇటు జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ది చెప్పడంతో పాటూ మరోవైపు వైసిపిని పూర్తిగా కనుమరుగు చేసేందుకు ప్రజలందరూ సంసిద్ధులుగా ఉన్నారన్నారు. ఏలూరు 21వ డివిజన్ శాంతి నగర్‌లో 8వ రోజు నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎమ్‌ఆర్.నాగేశ్వరావు, డివిజన్ ఇన్‌ఛార్జి ఉప్పూరి రామకృష్ణ పాల్గొన్నారు.

'వనితమ్మా.. మీ వెంటే మేమంతా'

ద్వారకాతిరుమల: వనితమ్మ వెంటే తామంతా నడుస్తామని మండలంలోని వివిధ గ్రామాల శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు, యువత తెలిపారు. శుక్రవారం రాత్రి వారంతా పెద్ద ఎత్తున పదుల సంఖ్యలో కార్లలో ర్యాలీగా బయలుదేరి యర్నగూడెం క్యాంప్ ఆఫీసులో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిశారు. గోపాలపురం నియోజకవర్గం ఎంఎల్‌ఎగా వనితమ్మను భారీ మెజార్టీతో గెలిపించడానికి తామంతా సిద్ధమని వివరించారు. అనంతరం సభ్యులంతా కలిసి మంత్రిని సన్మానించారు. వందల సంఖ్యలో నాయకులంతా కలిసి వనిత సమక్షంలో తెలపడం పట్ల సంఘం వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నమోదుపై రైతులకు అవగాహన

ముసునూరు: ప్రతి రైతు ఇ-క్రాప్ బుక్కింగ్ చేయించుకున్నట్లయితే ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీ ప్రతి రైతుకు అందుతుందని వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలకేంద్రమైన ముసునూరు రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ రైతులతో కలిసి గ్రామ సభ నిర్వహించారు. రబీ పంటకాల సమయంలో ప్రతి రైతు తమ పంట పొలంలో వేశారో వాటి వివరాలు, పంట నమోదు యొక్క ప్రాధాన్యత రైతులకు వివరించారు.

పిల్లలు శ్రద్ధగా చదవాలి : లయన్స్

ఏలూరు: పిల్లలు శ్రద్ధగా చదివి పాఠశాలకు, కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని లయన్స్ ఇంటర్నేషనల్ ఏలూరు స్మార్ట్ సిటీ లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, ట్రస్టీ విజెఎంబిఆర్.కృష్ణారావు కోరారు. శనివారంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న 143 మంది విద్యార్థులకు లయన్స్ ఇంటర్నేషనల్ ఏలూరు స్మార్ట్ సిటీ లైన్స్ క్లబ్, ట్రెస్ ఇండియా తరఫున ఎగ్జామ్ ప్యాడ్స్, స్కేంపెన్ బాక్సు, పెన్ను, స్కేల్, ఎరేజర్, షార్పనర్స్ ఇవ్వడం జరిగింది. అనంతరం ట్రెస్ ఇండియా అధ్యక్షులు డిఎ యాంజిల్ పాఠశాలలో మొదటి బహుమతి వచ్చిన విద్యార్థికి రూ.5 వేలు, అలాగే ద్వితీయ బహుమతి వచ్చిన విద్యార్థులకు రూ.3 వేలు, తృతీయ బహుమతి వచ్చిన విద్యార్థులకు రూ.2 వేలు బహుమతిగా ప్రకటించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ప్రకాష్, పాఠశాల సీనియర్ సహోపాధ్యాయులు రాజ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పి.వి.నరసింహారావు విద్యార్థులకు బహుమతులు ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కళలను ప్రోత్సహించడం అభినందనీయం

చింతలపూడి : అంతరించిపోతున్న జానపద కళలను ప్రోత్సహించటం అభినందనీయమని తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. మండలంలోని రేచర్ల గ్రామంలో కోలాటం గురువు సిరికొండ సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాఘవాపురం శివారు అంకాలు కొత్తగూడెం గ్రామంలో కోలాటం నేర్చుకున్న సీతారామ లక్ష్మణ దాసాంజనేయ స్వామి కోలాట బృందానికి తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గజ్జలు, దుస్తులు నిమిత్తం రూ.28 వేల నగదు అందజేసినట్లు సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దే సత్యనారాయణ, చీకటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 'మానవత' నూతన కార్యాలయం ప్రారంభం

భీమడోలు: మానవత భీమడోలు శాఖ కార్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని శాఖ ఛైర్పర్సన్ గుళ్ళ నూకరాజు తెలిపారు. రూ.30 లక్షల వ్యయంతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు హాజరుకానున్నారన్నారు. శనివారం శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ మల్కీ మహమ్మద్ పురం గ్రామానికి చెందిన నిరుపేదలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మలపల్లి రాజేష్(30) యడవల్లి వద్ద నుంచి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

ఏలూరు అర్బన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జరిగిన ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్ రావు, పశ్చిమగోదావరి జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.చంద్రశేఖర్ బాబు తెలిపారు. జిల్లాలో 51 కేంద్రాల్లో శనివారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలకు మొత్తం 14,081 మందికి గాను 13,660 మంది హాజరు కాగా 421 మంది గైర్హాజరు అయ్యారు. ఇందులో సాధారణ విద్యార్థులు 12,184 మందికి 11,894 మంది హాజరు కాగా 290 మంది గైహాజరయ్యారు. వృత్తి విద్యావిభాగంలో 1,897 మందికి 1,766 మంది హాజరు కాగా 131 మంది గైర్హాజరు అయ్యారు. మొత్తం 97 శాతం హాజరు నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లాలో 50 కేంద్రాల్లో మొత్తం 15,200 మందికి 14,854 మంది హాజరు కాగా 346 మంది గైర్హాజరయ్యారు. ఇందులో సాధారణ విద్యార్థులు 13,763 మందికి 13,508 మంది హాజరుకాగా 255 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో మొత్తం 1,437 మందికి 1,346 మంది హాజరుకాగా 91 మంది గైర్హాజరు అయ్యారు. 97.7 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు వారు తెలిపారు.

కలిదిండి : ఇంటర్ ద్వితీయ సంవత్సర తెలుగు పరీక్షకు నలుగురు విద్యార్థులు గైహాజరైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 143 మంది విద్యార్థులకు గాను 139 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలకు శనివారం విద్యార్థులు తరలివచ్చారు. హాల్ టికెట్లు పరిశీలించి, గేటు బయటనే తనిఖీలు నిర్వహించి పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 352, వాగ్దేవి కళాశాలలో 280, సెయింట్ ఆన్స్ కాలేజీలో 249, సిద్ధార్థ కాలేజీలో 222, శారదా కాలేజీలో 278 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 1,380 మంది విద్యార్థులకు 1,339 మంది విద్యార్థులు హాజరయ్యారు. 41 మంది విద్యార్థులు గైహాజరయ్యారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది.

ముదినేపల్లి: ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా ఏడుగురు గైర్హాజరయ్యారు. 193 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు డిపార్ట్మెంటల్ ఆఫీసర్ కెవి.నాగేశ్వరరావు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో బంగారు పతకాలు

ఏలూరు : చిత్రలేఖనం పోటీల్లో శనివారపు పేట జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు హెచ్ఎం ప్రకాష్ రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్ర సంఘానికి గుర్తించబడిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన ఆల్ ఇండియా చిత్రలేఖనం పోటీల్లో శనివారపు పేట జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు శనివారం కెఎల్ యూనివర్సిటీ ఆడిటోరియం గుంటూరులో మల్లకాంతి లక్ష్మీ కాంతరెడ్డి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా జాస్తి అనంత పద్మ శేఖర్, పౌండర్ అనంత డైమెండ్స్ వారి ద్వారా బహుమతులు అందుకున్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు కె.ప్రేమ్ కుమార్ 9వ తరగతి, ఎల్.భాను ప్రకాష్ 9వ తరగతి, సిహెచ్.యతిక్ రమీ 7వ తరగతి, కె.తేజశ్రీ 7వ తరగతి గోల్డ్ మెడల్స్ సాధించారు. కె.గాయత్రి 6వ తరగతి, ఆర్.యమున 6వ తరగతి, ఎమ్.లికితరాణి 6వ తరగతి, బి.ప్రణతి 6వ తరగతి సిల్వర్ మెడల్స్ అందుకున్నట్లు అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, వారికి తర్ఫీదు ఇచ్చిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు ఎమ్‌డి.ఇర్షాద్ అహ్మద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ కె.రాజ్‌కుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రసాద్, ఎస్‌కె.కాలేషా, సుబ్బారావు పాఠశాల ఉద్యోగ సిబ్బంది అభినందించారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

చింతలపూడి: నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని రాజీవ్ థామస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అండ్ ఫౌండర్ మారుమూడి థామస్ అన్నారు. చింతలపూడి మండలంలోని పాతచింతలపూడి గ్రామానికి చెందిన వెలగలేటి మహీంద్రా కొడుకు మహేష్ 8వ తరగతి చింతలపూడిలోని సుబ్బరాజు హైస్కూల్‌కి సుమారు 5 కిమీ రోజు నడుచుకుంటూ వెళ్తున్నాడని టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అనీష్ కుమార్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం టిడిపి ఆధ్వర్యంలో చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం చేతుల మీదుగా రాజీవ్ థామస్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున విద్యార్థికి సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు తాడేపల్లి దాసు బాబు, సరిపల్లి నవీన్ పాల్గొన్నారు.

కాలినడక రహదారి పనులు ముమ్మరం

పోలవరం: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పట్టిసీమ గ్రామం వద్ద గోదావరి నది మధ్యలో కొలువై ఉన్న శ్రీభద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు గోదావరి నది దాటేందుకు పంటెలతో ఏర్పాటు చేసే కాలినడక రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాలు మార్చి 8వ తేదీన జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాలకు రెండు రోజులు ముందుగానే పూర్తి అయ్యేలా పనులు చేస్తున్నట్లు పెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ తెలిపారు.

పలుచోట్ల ఇళ్ల పట్టాలు పంపిణీ

జంగారెడ్డిగూడెం టౌన్ : నవరత్నాల ద్వారా పేదలందరికీ ఇచ్చిన నివాశ స్థలాల దస్తావేజుల పంపిణీ కార్యక్రమం 5వ సచివాలయం రామచంద్రపురంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. 5వ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులు 109 మంది పట్టాలకు శనివారం రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ నాయకులు బత్తిన చిన్నా, తాటికుంట్ల రవి కుమార్, గూడపటి రాధాకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుత రామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కామవరపుకోట: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న కార్యక్రమం పేదలందరికీ ఇళ్లుఅని జెడ్‌పిటిసి కడిమి రమేష్ అన్నారు. దీనిలో భాగంగా తడికలపూడి గ్రామ పంచాయతీలో ఇంటి స్థలాలు లబ్ధిదారు పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి రిజిస్ట్రేషన్ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తడికలపూడి సర్పంచి కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపిటిసి గంగుల కడియాలు, తడికలపూడి సొసైటీ అధ్యక్షులు గంగుల కాశీ పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రజా సంక్షేమం కోసం కట్టుబడిన పార్టీ వైసిపి అని, ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిదని చింతలపూడి ఎంపిపి డాక్టర్ రాంబాబు అన్నారు. చింతలపూడి మండల పరిషత్ కార్యాలయంలో పేదలందరికీ పట్టాల పంపిణీ, ఇంటి స్థలం బదలాయింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వైసిపిలో లబ్ధి చేకూరిందని అన్నారు. అనంతరం జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసిపిని గెలిపించడానికి అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి సర్పంచి మోహన్, చింతపల్లి సర్పంచి రామకృష్ణ, వెంకటాద్రిగూడెం సర్పంచి రామారావు, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

బుట్టాయగూడెం: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, పోలవరం నియోజవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. పులిరాముడుగూడెం సచివాలయం పరిధిలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, కోట రామచంద్రాపురం సచివాలయ పరిధిలో రూ.15.50 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్‌ను, సీసీ రోడ్లను, బుట్టాయిగూడెం-2 సచివాలయ పరిధిలోని కంసాలకుంటలో సీసీ రోడ్లను, దొర మామిడి గ్రామ సచివాలయం పరిధిలో రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయంను, రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్‌ఎ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గుగ్గులోతు మోహన్ రావు, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, ఎస్‌టి సెల్ అధ్యక్షులు కొవ్వాసి నారాయణ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: మండలంలోని బోరవంచ గ్రామంలో ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్ మరలా ముఖ్యమంత్రి అవ్వటం ఖాయమని, పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ వైసిపి అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఎంపిపి ఆరేపల్లి శిరీష పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ కలిసి దెందులూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో శనివారం పాల్గొన్నారు. పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామంలో రూ.22 లక్షల జెడ్‌పి నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. పాతముప్పరు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం పెదపాడు మండలం నాయుడుగూడెం గ్రామంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి ఎంఎల్‌ఎ ప్రారంభించారు.

'రాజకీయ లబ్ధి కోసమే వివేకానందరెడ్డి హత్య'

ఏలూరు టౌన్: వివేకా హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ పూర్తి స్థాయిలో జరగాలని, వివేకా హత్య జగన్ రెడ్డి ముఠాయే చేసిందని దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సిబిఐ విచారణ పిటిషన్ వేస్తానని సునితమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని, మొదట సిబిఐ విచారణ కోరిన జగన్ రెడ్డి తరువాత వద్దు అనడం వెనుక కారణాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాలని చింతమనేని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో
I.A. 28/2023 in O.S. 260/2011

Between:
కండవల్లి ప్రిసిల్లా (డైడ్), వగైరా
-పిటీషనర్/ ప్లెయింటిఫ్
మరియు
కండవల్లి పద్మాస్‌కుమార్ (డైడ్), వగైరా
-రెస్పాండెంట్స్/ డిఫెండెంట్స్

To:
R-30: కండవల్లి శాంతిపాల్, W/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-31: కండవల్లి రఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-32: కండవల్లి కెఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.

పై నంబరు పిటీషన్‌లో పైన ఉదహరించిన R30, R31, R32 రెస్పాండెంట్సు హాజరు నిమిత్తం ది. 18-3-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున 30, 31, 32వ రెస్పాండెంట్సు వాయిదా రోజు అనగా **ది. 18-3-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల 30, 31, 32వ రెస్పాండెంట్సు పరోక్షంలో I.A. తీర్మానించబడును.

ఏలూరు **బి.శ్రీలక్ష్మి,** అడ్వకేట్
02-03-24 ఏలూరు, సెల్: 8019442114

IN THE COURT OF THE MACT CUM II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD, TELANGANA
O.P.NO. 94 OF 2023

BETWEEN :
Kaddakal maheshwari & Others ... Petitioners
AND
Ravi Kumar & Others ... Respondents

To,
1. Ravi Kumar, Age : 36 Years, Occ. Goods Carriage Driver, R/o. 3-1-767, P.P. Road, Bhimavaram ...R1

Whereas the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under the M.V. Act.

Please take notice that the above O.P. stands posted to **14-03-2024** for your appearance, you are required to appear before Hon'ble Court at **10:30** am on the above date either in person or through and advocate, failing which the matter will be decided exparte

// BY ORDER OF THE COURT //

C. SATISH KUMAR REDDY
Advocate
Plot No. 36/1 # 3-125/36,
Shanthinagar Colony, Uppal,
Hyderabad -39
Cell : 9440039530

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 4528 of 2022

Between :
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer, ...Plaintiff
AND
Sri.A.Sudhakar ...Defendant

To
Sri.A.Sudhakar, S/o.S.CH.Bose, Aged about 42 Years, Occ: Employee, R/o. H.No.35-42-7/1, Flat No.3, Station Road, Tanuku, West Godavari, A.P-534211.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,90,664-35ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 07-03-2024.

In case of your failure to attend before the Court on **07-03-2024** at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)

T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village,
HYDERABAD-50.

CHANGE OF NAME

I SHAIK ZAINAB, W/o. IBRAHEEM MOHAMMED ALI SHAIK, Resident of D.No. 3-44, Ramalayam Street, Near Post Office, Sanivarapupeta, Eluru, Eluru District, Andhra Pradesh - 534003. I have changed my name from **GUDAPATI KARUNA KUMARI** (Old) to **SHAIK ZAINAB** (New), As per affidavit dated 02-03-2024 for future references.

In the Court of the Hon'ble VII Addl. District Judge Cum Family Judge, Eluru
O.S. No. 42/2021

Between:
Sri. Ghanta Gangadhara Rao ...*Plaintiff*
AND
Sri. Bandaru Venkata Satyanarayana ...*Defendant*

పై నంబరు దావాలో Defendant అయిన Sri. Bandaru Venkata Satyanarayana, S/o. Krishna Murthy, R/o. D.No. 2-16, Gundugolanugunta Village, D.Tirumala Mandal, W.G.Dist., అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 07-03-2024 వాయిదా అయివున్నది.** సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 గం॥లకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

E.SRINIVASA BABU
ఏలూరు **A.RAVI KUMAR**
01-2-2024 Advocates, Eluru

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో
I.A. 29/2023 in O.S. 260/2011

Between:
కండవల్లి ప్రిసిల్లా (డైడ్), వగైరా
-పిటీషనర్/ ప్లెయింటిఫ్
మరియు
కండవల్లి పద్మాస్‌కుమార్ (డైడ్), వగైరా
-రెస్పాండెంట్స్/ డిఫెండెంట్స్

To:
R-30: కండవల్లి శాంతిపాల్, W/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-31: కండవల్లి రఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-32: కండవల్లి కెఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.

పై నంబరు పిటీషన్‌లో పైన ఉదహరించిన R30, R31, R32 రెస్పాండెంట్సు హాజరు నిమిత్తం ది. 18-3-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున 30, 31, 32వ రెస్పాండెంట్సు వాయిదా రోజు అనగా **ది. 18-3-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల 30, 31, 32వ రెస్పాండెంట్సు పరోక్షంలో I.A. తీర్మానించబడును.

ఏలూరు **బి.శ్రీలక్ష్మి,** అడ్వకేట్
02-03-24 ఏలూరు, సెల్: 8019442114

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో
I.A. 30/2023 in O.S. 260/2011

Between:
కండవల్లి ప్రిసిల్లా (డైడ్), వగైరా
-పిటీషనర్/ ప్లెయింటిఫ్
మరియు
కండవల్లి పద్మాస్‌కుమార్ (డైడ్), వగైరా
-రెస్పాండెంట్స్/ డిఫెండెంట్స్

To:
R-30: కండవల్లి శాంతిపాల్, W/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-31: కండవల్లి రఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-32: కండవల్లి కెఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.

పై నంబరు పిటీషన్‌లో పైన ఉదహరించిన R30, R31, R32 రెస్పాండెంట్సు హాజరు నిమిత్తం ది. 18-3-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున 30, 31, 32వ రెస్పాండెంట్సు వాయిదా రోజు అనగా **ది. 18-3-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల 30, 31, 32వ రెస్పాండెంట్సు పరోక్షంలో I.A. తీర్మానించబడును.

ఏలూరు **బి.శ్రీలక్ష్మి,** అడ్వకేట్
02-03-24 ఏలూరు, సెల్: 8019442114